క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో 11కేవీ కేశవరెడ్డినగర్ ఫీడర్ పరిధిలోని పలు కాలనీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేశవరెడ్డినగర్, పోస్టాఫీసు, టీఎస్ఆర్ నగర్, డైనమిక్ కాలనీ, మీర్‌పేట విలేజ్, రాఘవేంద్రకాలనీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

కిషన్‌రెడ్డికి సన్మానం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో ఎంపీపీ మంద జ్యోతి దంపతులు

కందుకూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని దీమా వ్యక్తం చేశారు.

జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు



పూజశ్రీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు: కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన పాత్లావత్ పూజశ్రీ 10వ తరగతి ఫలితాల్లో 9.7 జీపీఏ మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలవడంతో పాటు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. దీంతో గురువారం ప్రధానోపాధ్యాయురాలు కాంచన ఆధ్వర్యంలో విద్యార్థినితో పాటు ఆమె తండ్రి నరేందర్‌ను స్థానిక ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, రాంనుంతల సర్పంచ్ సోనాశ్రీనునాయక్, ఎంపీటీసీ శ్రీలత సన్మానించారు. అందుకు కారకులైన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం మురళీ మోహనాచారి, ఉపాధ్యాయులు రమాదేవి, రచన, జ్యోతి, భాగ్య, కె.జ్యోతి పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో అద్భుత ప్రగతి

బీజేపీ సీనియర్ నేత ఆచారి



గిరిజనులతో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అద్భుత ప్రగతి సాధించిందని బీజేపీ సీనియర్ నేత ఆచారి అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో ఆచారి పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో అనేక విజయాలు సాధించిందని చెప్పారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు కేంద్రం అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్య, నాయకులు వెంకటేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా మహోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు యోగా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్ర లేఅవుట్‌లోని కమ్యూనిటీ హాల్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్, శ్రీరామచంద్రా మిషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సాయంత్ర 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యోగా మహోత్సవం జరుగుతుందన్నారు. ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యానంలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. అదే విధంగా 5 నుంచి 15 సంవత్సరాల వయస్సు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, అద్భుతమైన పరిజ్ఞానం, గ్రహణశక్తి పెంపు కోసం బ్రైటర్ మైండ్ అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నం. 9177778233లో సంప్రదించవచ్చన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 75, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 85, కాకర 55, బీర 40, క్యాబేజీ 16, ఫ్రెంచి బీన్స్ 65–95, క్యారెట్ 50, దొండ 37–55, చిక్కుడు 65–85, గోకర 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 67, చామగడ్డ 40. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పార్కుల నిర్వహణ పట్టదా?

- నిర్మానుష్యంగా హుడాకాలనీ పార్కు
- నిర్వహణ లోపంతో పచ్చదనం కనుమరుగు
- తుప్పపడుతున్న ఆట పరికరాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పార్కులో నిరుపయోగంగా పిల్లల ఆట పరికరాలు, కానరాని పచ్చదనం

హుడాకాంప్లెక్స్: కాలనీల్లోని పార్కుల్లో పచ్చదనం కనుమరుగవుతోంది. పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుపడుతున్నాయి. చెత్తా–చెదారం, దుమ్ము, ధూళితో నిండి అందవిహీనంగా తయారవుతున్నాయి. సాయంత్రం వేళల్లో చిన్నారులు ఇక్కడకు వచ్చి సరదాగా గడిపేందుకు తగిన సౌకర్యాలు లేవు. ఈ దయనీయ పరిస్థితికి సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం సమీపంలో ఉన్న హుడాకాలనీ పార్కు అద్దం పడుతోంది. పార్కు అభివృద్ధి, సుందరీకరణ, నిర్వహణ చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది. మార్నింగ్ వాక్ కోసం కూడా ఉపయోగం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ పట్టని అధికారులు..

రాలిన చెట్ల ఆకులను తగులబెట్టడం, ఎప్పటికప్పుడు చెత్తను తరలించడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇక్కడ కాలనీ ఏర్పాటు చేసినప్పుడు సుమారు 2వేల గజాల స్థలాన్ని చిల్డ్రన్స్ పార్కుకు కేటాయించారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ప్రహరీ నిర్మించి పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఆయా పరికరాలు తుప్పుబడుతున్నాయి. అధికారులు స్పందించి పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని.. చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సుందరీకరణ చేపట్టాలి



చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన పార్కులో పచ్చదనం కరువైంది. పచ్చని చెట్లు, పూల మొక్కలు వాడిపోతున్నాయి. వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేసేవారు లేరు. దీంతో వాకర్స్, పిల్లలు ఆడుకోవడానికి రావడం లేదు. పచ్చదనం, ఆహ్లాదం ఉంటేనే పిల్లలు ఆనందంగా ఆడుకోవడానికి వస్తారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సుందరీకరణ పనులు చేపట్టాలి.

– రాజేశ్వరి, హుడాకాలనీ

కందుకూరుకు మెడికల్ కాలేజీపై హర్షం

సీఎం చిత్రపటానికి బీఆర్ఎస్ నేతల క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలానికి మెడికల్ కళాశాల మంజూరు చేయడం పట్ల గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సబితారెడ్డి చేస్తున్న కృషికి సీఎం కేసీఆర్ చేయూతనందించేలా మెడికల్ కళాశాల కేటాయించడం శుభపరిణామమని కొనియాడారు. పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిరాదేవేందర్,ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: బోనాల ఉత్సవం తెలంగాణ పండుగని.. కుమ్మర సంఘం ఆధ్వర్యంలో తొలి బోనం సమర్పించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం కట్టమైసమ్మ తల్లికి గురువారం తొలి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమంతోపాటు కులవృత్తులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎంపీపీ నిరంజన్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, యాచారం ఎంపీపీ సుకన్య, సబ్‌రిజిస్ట్రార్ మధుబాబు, కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కందుకూరు: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలకు సకల సౌకర్యాలు కల్పిస్తూ రూ.2లక్షల వేతనం అందిస్తున్న ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు కేవలం రూ.8 వేలు మాత్రమే ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులకు రూ.26వేల చొప్పున వేతనం అందించాలని, కారోబార్లను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించి ప్రభుత్వ ఖజానా నుంచే వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం మండల అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, మహేష్, యాదయ్య, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్



మహేశ్వరం: కల్వకోల్‌లో పర్యటిస్తున్న వీరేందర్ గౌడ్, బీజేపీ నాయకులు

మహేశ్వరం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో బీజేపీ జెండాను ఎగురవేసి తీరుతామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ దీమా వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆ ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో కలిసి పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో మహేశ్వరంతో పాటు రాష్ట్రంలో బీజేపీ గెలుస్తుందని ఆయన దీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు, బీటీ రోడ్ల నిర్మాణానికి, రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి కింద సహాయం, ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, కరోనా వ్యాక్సిన్‌లు, ఎరువులు, విత్తనాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, సుధాకార్ శర్మ, పంతునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్, మండల అధ్యక్షుడు మాధవచారి, సీనియర్ నాయకులు వెంకటేష్‌గౌడ్, రఘుపతిగౌడ్, మనోహర్, యాదయ్య పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

బడంగ్‌పేట్: జన సంపర్క్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న గడపగడపకు బీజేపీ గురువారంతో 15వ రోజుకు చేరుకుంది. బాలాపూర్‌లో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌కు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతించారు. మహిళలు బోనాలతో తరలి రాగా అందెల శ్రీరాములుతో కలిసి నల్లపోచమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలువురు యువకులు అందెల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో తప్పనిసరిగా కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ తొమ్మిదేళ్ల కాలంలో చేపట్టిన సంస్కరణలు, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తిరిగుతూ.. అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీధర్‌రెడ్డి, శంకర్, మాధురి, పద్మ, సునీత, ఇంద్రసేన, అమిత, లక్ష్మారెడ్డి, నాయకులు శూరకర్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్, ప్రభాకర్, నాగార్జున తదితరులున్నారు.

రోడ్డేమో ఇలా.. ప్రయాణం ఎలా?



ఎంఎల్ఆర్ కాలనీ–మీర్‌పేటకు వెళ్లే రోడ్డు దుస్థితి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి ఎంఎల్ఆర్ కాలనీ నుంచి మీర్‌పేట చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్డంతా బురదమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్‌షాపు నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ ముఖద్వారం వరకు ప్రధాన రహదారి అభివృద్ధికి గాను రూ.30 లక్షల నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే రోడ్డును అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపసర్పంచ్ అజీజ్‌పై చర్యలు తీసుకోండి

తలకొండపల్లి: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి మాదిగ కులాన్ని అవమానించే విధంగా మాట్లాడటం సరైందికాదని ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు అన్నారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన వెల్జాల్ ఉప సర్పంచ్ అజీజ్‌ను పదవి నుంచి తొలగించాలని ఎంపీడీఓ శ్రీకాంత్‌కు గురువారం వారు వినతి పత్రం అందజేశారు. మాదిగ జాతిని అడుక్కొని తినేవాళ్లగా అవమానించి మాట్లాడిన అజీజ్‌పై చర్యలు తీసుకోవాలని తలకొండపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్‌లు కృష్ణ, కిరణ్, మండలాధ్యక్షుడు కిరణ్‌పూలే, ఎంఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అనిల్, విజయ్, గణేష్, శ్రీశైలం, భాస్కర్, చెన్నకేశవులు, శేఖర్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం



మీర్‌పేట: జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న విక్రంరెడ్డి, నాయకులు



హుడాకాంప్లెక్స్: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి ఆధ్వర్యంలో గురువారం గాయత్రీనగర్ చౌరస్తాలో దివంగత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి.. జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్పొరేటర్ బాలమణి మాట్లాడుతూ బలహీనవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రాం ఎనలేని కృషి చేశారని.. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాంచందర్, అనిల్‌యాదవ్, లావణ్య, కోఆప్షన్ సభ్యుడు జంగయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకులు కామేష్‌రెడ్డి, నాయకులు అంజయ్య, దోమలపల్లి రాజ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ పంతంగి మాధవి, అంబేడ్కర్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు ఓంప్రకాశ్, సహదేవ్, యాదయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

బీజేఆర్ భవన్‌లో..

హుడాకాంప్లెక్స్: బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా బీజేఆర్ భవన్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిక్కుళ్ల శివప్రసాద్, రామకృష్ణాపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేశ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బండి మధుసూదన్‌రావు, ధన్‌రాజ్‌గౌడ్, గట్ల రవీంద్ర, తలాటి రమేష్, శివ, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వ్ సంస్థ సేవలు అభినందనీయం

ఎంపీపీ కమ్లీ



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న ఎంపీపీ, అతిథులు

కడ్తాల్: దివ్యాంగుల పునరావాసం వారి సంక్షేమాభివృద్ధికి సర్వ్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మైసిగండి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్వ్ సంస్థ, ఆర్టీసీ అధికారులతో కలిసి దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ, అదే విధంగా కామినేని ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై ఆయా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. దివ్యాంగులకు అవసరమైన విద్యా, వైద్య, ఆర్థిక, సామాజిక అవసరాలను గుర్తించి వారి సంక్షేమం కోసం సర్వ్ సంస్థ కృషి చేయడం అభినందనీయమని అన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేస్తున్న సర్వ్ సంస్థకు తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు బస్‌పాసులు అందజేయడంతో పాటు, కామినేని ఆప్పత్రి వైద్యులు 210 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసీరాంనాయక్, సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, సంస్థ అధ్యక్షురాలు మీనాక్షి, క్యాంపు ఇన్‌చార్జి శ్రీధర్, సర్వ్ సంస్థ సిబ్బంది శ్రీనివాస్, శివ, ఆర్టీసీ బస్‌పాసుల ఇన్‌చార్జి శ్రీరాములు, వైద్య సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

శరవేగంగా 'మోడల్' నిర్మాణం

- కొంగర్ కలాన్ వద్ద రూ.1.5 కోట్లతో మోడల్ మార్కెట్ నిర్మాణం
- మాంసం, కూరగాయలు, పండ్ల విక్రయాలన్నీ ఇక్కడే
- రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తాం: కమిషనర్



ఆదిబట్లలో నిర్మిస్తున్న మోడల్ మార్కెట్ భవనం

ఇబ్రహీంపట్నం రూరల్: పుర ప్రజలకు అన్ని వస్తువులు ఒకేచోట దొరికేలా ప్రభుత్వం మోడల్ మార్కెట్లను నిర్మిస్తోంది. అందులో భాగంగానే ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రం కొంగరకలాన్‌కు వెళ్లే దారిలో సర్వే నంబర్ 442లో సమీకృత మోడల్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రెండు ఎకరాల స్థలం కేటాయించిన విషయం తెలిసిందే. రూ.1.5 కోట్లతో ఈ భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం మేర పనులు పూర్తిచేశారు. మాంసం, కూరగాయాలు ఒకేచోట అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. ఇక్కడే పండ్లు, పూలను కూడా విక్రయించేందుకు నిర్మాణాలు చేపడుతున్నారు. కూరగాయల దుకాణాలకు 14, మాంసం దుకాణాలకు 14 షటర్ల చొప్పున కేటాయించారు. భవన సముదాయం మధ్యలో ఖాళీ స్థలంలో పూలు, పండ్లు అమ్ముకోవడానికి తాత్కాలిక నిర్మాణాలు చేపడతారు. మరో రెండు నెలల్లో ఈ మార్కెట్ ప్రజలకు అందుబాటులోకి రానుంది.

200 మందికి ఉపాధి...

ఆదిబట్ల మున్సిపాలిటీలో మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 200కు పైగా ప్రజలకు ఉపాధి లభిస్తుంది. ఇదే కాకుండా పక్క ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఉపాధి లభిస్తుంది. మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక చొరవతో నిర్మాణం చేపడుతున్నారు. ప్రజారోగ్య శాఖ తరుపున పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం అందించే ప్రత్యేక నిధులతో మార్కెట్ నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. నాణ్యతో కూడిన పనులు చేయాలని అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

త్వరలో నిర్మాణం పూర్తిచేస్తాం



మున్సిపల్ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నాం. పట్టణ కేంద్రాల్లో వెజ్–నాన్‌వెజ్ దుకాణాలు ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. అందుకే పట్టణానికి కొద్ది దూరంలో మోడల్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నాం. త్వరలో భవన నిర్మాణం పూర్తిచేస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకు మార్కెట్ సముదాయాల కేటాయింపు జరుగుతుంది.

– అమరేందర్‌రెడ్డి, కమిషనర్, ఆదిబట్ల

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌వీఈపీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్వీట్ తయారీ కేంద్రాన్ని గురువారం ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా సందర్శించారు. ఆమనగల్లులో ఇటీవల ఏర్పాటు చేసిన స్వీట్ తయారీ కేంద్రంలో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదుగుతున్న మహిళలను గంప వెంకటేశ్ అభినందించారు. కడ్తాల మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వీరయ్య, ముద్విన్ ఉపసర్పంచ్ వినోద్, స్వీట్ తయారీ కేంద్రం నిర్వాహకులు, శిక్షకులు అరుణజ్యోతి, శశిరేఖ, నాగమణి, లావన్య, హిమబిందు, వినోద, నర్మద, భాగ్యలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా లయన్స్‌క్లబ్

- క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్
- జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లను సన్మానించిన సభ్యులు



చిద్విలాస్‌రెడ్డి, బాలరాజుగౌడ్‌ను సత్కరిస్తున్న ఆమనగల్లు లయన్స్ క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు లయన్స్‌క్లబ్ అండగా ఉంటుందని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ ముందుంటుందని ఆయన చెప్పారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించిన చిద్విలాస్‌రెడ్డి, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలో 129వ ర్యాంక్ సాధించిన కొప్పుల బాలరాజుగౌడ్.. వారి తల్లిదండ్రులను ఆమనగల్లు పట్టణంలోని లయన్స్ భవనంలో గురువారం క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ.. పట్టుదల, కృషి, ఏకాగ్రతతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సమకూరుస్తున్నట్లు చెప్పారు. లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, లింగయ్య, కసిరెడ్డి రాంరెడ్డి,నర్సింహ, యాదయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, పీఆర్ఓ పాషా పాల్గొన్నారు.